# తిక్కన 'సుధేష్ణ'

శ్రీ పుట్టపర్తి నారాయణాచారిగారు

మహాకావ్య మొక విశాలగంభీరమగు సముద్రమువంటిది. దానిని చేయూతనీదుటయు, అందున సైయనిపించుకొనుటయు దుస్తరము. వ్రాయుచున్నపుడు పదే పదే తలమలపి చూచుటకుఁగాని హెచ్చుతగ్గులనొత్తి యతికి సవరించుటకుఁగాని వీలుదొఱుకదు. ఒకవేళ కవి జాగరూకుఁడై గమనించినను పూర్తిఁగా నేరిపోయలేఁడు. కనుచూపుమేరకు కథాభాగమే గనఁబడుచుండును. అట్టియెడ అంగాంగములఁ బరీక్షించుటకు సామాన్యసృష్టికర్తకు సాధ్యమగునా? అయిన సంపూర్తిగా నసాధ్యమేనా? అసాధ్యమనిగాదు నేఁ జెప్పవచ్చినది. అరుదనిమాత్రమే. అందుకైఁ బ్రయత్నించి కొంతవరకు పాకమునకుఁ దెచ్చిన వానినే "మహాకవి" యందుము. అలంకారికులీ "సార్వత్రికదృష్టిని" గురించి పలుమారు ప్రస్తావించిరి. ఆవశ్యకములగు అంగములలో దానికి ప్రధానపట్టముఁగూడఁ గట్టిరి. మొత్తముపై నిది కత్తిపైని సామే. రసమునకు పరవశుఁడై నడచు కవి కూలంకషమగు ధారను మందగించి ఆత్మవిమర్శనఁ గావించుకొనుటయునఁ బిల్లాటగాదు కదా!

చాలవరకు మన కవులు చీకాకుపడిన ఘట్టములలో నిది యొకటి. వారు ప్రధానదృష్టిని నాయకునియందే లగ్నము గావింతురు. ఇతరములగు పాత్రను లేగతిఁ బట్టినవిరాయని విచారించుట మిక్కిలి యరుదు. లేనేలేదన్నను అంత దోషముగాదేమో! భట్టనారాయణుఁడు గొప్ప రచయితయట. నాటికములయందలి లక్షణములిందు బాగుగా సమన్వయించునని ఆలంకారికుల "సర్టిఫికెట్టు"లున్నవి. కొన్ని ఘట్టములు కొంతవరకు కొందరికి నచ్చవచ్చును. కాని కథాభాగమునకుఁ బట్టిన యవస్థ! వాడి వత్తలై వంకలు దిరిఁగినది. ప్రతినాయకుఁడగు దుర్యోధనునకుఁ బట్టిన గతి భీముని గదాఘాతమునకన్న పెద్దది. కాళిదాసునకును, భాసునకును దక్క మరియొకరికీ యాస్థయు దృష్టియు నుండెనా యని సందేహపడవలసియున్నది.

ఈ పరిపాటికి నాదృష్టికి రెండుభాషలలో సాటిలేనివాఁడు తిక్కన. అతని భారతమునుఁ జదువునపుడు సామాన్యములగు వాటి నటుండనిచ్చి అల్పాల్పములగు పాత్రములకును జిలికించిన కాంతిని గమనింప వీలుగలదు. హృదయమును తన కనుసన్నల మెలఁగఁజేయు యోగి తిక్కన మహాశయుఁడు.

నిజముగా విరాటపర్వమున సుధేష్ణపాత్ర కంటికి గానరాని నలుసు. అందులో సమగ్రభారతమును పూరింపఁ దొరకొను కవికి, సుధేష్ణపాత్రికనులకే గోచరింపదు. వేరొకఁడే భారతమును రచించియున్నచో నేడు "నానా రసాభ్యుదయోల్లాసి" యని

మనము పొంగిపోవు విరాటపర్వ మేగతిఁ బట్టియుండునో. వేరుగతి బట్టినవియు నున్నవి. చూచి గమనింపఁదగును. అసలు వ్యాసుడే, సుధేష్ణ, అపరిమిత మేధశ్శాలిని, అనుభవశాలిని, గుణవతి యని గ్రహించి యుండలేదు. మన తిక్కన యట్లుగాక మంచి చెడ్డలు రెంటను వివరించినాఁడు. ప్రమాణమునఁ జిన్నదియైనను నిత్యవర్చస్విని సుధేష్ణగాథ. ఇట్టివానినిఁబట్టి భారత రచనమునఁ దిక్కన దృష్టి యెంత సమగ్రమైనదో మన మూహింపవచ్చును.

సుధేష్ణ మేడతుదినిలువున నుబుసుపోకకు దిరుగాఁడుచున్నది. చెలికత్తె లిరువంకఁ గొలుచుచున్నారు. చిత్తమునందు నిర్విచారత, యుల్లాసము తెరలై పొరలి పోవుచున్నవి. ఒకసారి జాలకములఁ దొంగి చూచినది గాబోలు. వెంటనే దారినివచ్చుచున్న సైరంధ్రి యామె దృష్టి నాకర్షించినది. అతిమానుషమగు సైరంధ్రి రూపమునుఁ జూచినవెంటనే యామె మనుష్యకాంత గానోపదని నిర్ణయించినది. అయిననా మాటలేమి! నీచభాగులవలె భాషించుచున్నదే! దీనిపై కార్యకారణవిచారణ మామె మనసునకుఁ దట్టినది. ఆవితర్కము సందేహమునకుఁ జోటిచ్చినది. సందేహము కుతూహలతనుఁ బెంచినది. సైరంధ్రిపై గౌరవము, ఆదరముఁ గడలుకొన్నవి. కాని యన్నిటికి మిన్నయై సందేహముమాత్రము ముందు నిలిచినది. కనుగొందమను తలఁపున మాటలలో నారితేరిన "ప్రౌఢాంగన"ల నిరువురఁ బంచినది.

సైరంధ్రీపాత్రధారిణియగు ద్రౌపదికి రొట్టెవిరిగి నేతిలో బడినట్లైనది. "సౌముఖ్యము, సంభావనయు" గల యామగువ వారివెంట "వినయవైభవము సతీతను వొందిన చందమున" వెడలినది. తన్నుఁ దరిసినవెంటనే మనస్వినియగు సుధేష్ణ గౌరవము మొగమునను, కేలపురఃప్రసారమును దంతమరీచులసామినిర్గమమును గడలుకొనగా వానిపై నాదరరేఖ యనుఁ బూఁతఁ బూసి, గద్దియజూపి "యిందురమ్మని" సైగఁజేసినది. మరియాద నెఱిఁగిన గఱిత సైరంధ్రి "అంతనంతల" వినీతి నిల్చినదట. సుధేష్ణపరీక్షాదృష్టి మానలేదు. కుతూహలము, సందేహము పరస్పరముఁ బెనఁగొన్నవి. కడ "కుచితమయ్యెడు భంగి" ప్రశ్నించినది. ఆ తిక్కనమాట వరాలమూట. ఊహసేయలేనంతటి భావములఁ క్రోడీకరించుకొన్నది. కార్యజ్ఞురాలును, యుక్తిచతురయునగు సైరంధ్రి అసామాన్య. ఆమెపలుకు పాశుపతము. తొలుఁత మెఱుఁగుల వెట్టఁక తిన్నగా ఉన్నదున్నట్లు తన వృత్తాంతమునుఁ దెలిపినది. దానిలో సుధేష్ణ యనుమానముపోవునా? సురగరుడోరగ కాంతలలో నొక్కతెగాని, మనుష్యకాంత గాదని నిర్ధరించినది. అయిన నీ రహస్యమునుఁ జెప్పించుటెట్లు! అమేయప్రతిభారాశి యగు సైరంధ్రి ముందు సుధేష్ణయెత్తు కుప్పిగంతులైనది. భావశబలతచేఁ జకితయై యూహాప్రపంచమున బారలు జాచుచున్నది. ఆసందు గనిపెట్టి సైరంధ్రియు "దరహాసితము మోమునకుఁ దొడవుగాగ"

కథకు వన్నెలు చిన్నెలుదీర్చి, నగిషీపని జేసి, సుధేష్ణను పూర్తిగా భ్రమపెట్టి ఊఁ యనుచున్నది.

కాని సుదేష్ణ మనసెట్లును పాలుపోవుట లేదు. ఒకవంక నుత్కృష్టమగు రూపము, ప్రవర్తనలోని నాణెము, మాటలతీరు, గంధకారికావేషము, ఒకటికొకటి సందర్భింప నేరకున్నవి. పైగా సైరంధ్రి తన ప్రతిభారాశిలో ముంచియెత్తుచున్నది. అదియును గాక ఆ సైరంధ్రి తనయింటనే యుండ వచ్చుట లోకజ్ఞురాలగు నామెకు మరింత భయకారణము. తన తమ్ములు నూరుమంది. బాహుబలగర్వితుఁడును, రూపాభిమానియునగు కీచకుఁడు మదికిఁ దట్టినాఁడు. పురుషుల స్థైర్య మెంతపాటిదో యామెకుఁ దెలియనిదిగాదు కదా! కీచకుని విషయ మెట్లున్నను, ముసలిరాజే ముందుఁబడినచో తనగతి యేమి? సుధేష్ణకు గుండెలు నీరైనవి. తటాలున నామె గభీరహృదయము నుండి యీమాటలు స్పష్టముగా రాజసమును, బిడియమును, గౌరవమునుఁ దెమలించుకొని బైటఁబడినవి. దీనిచే నా యనుమాన మెంత గాటముగా నామె మనసంటి యుండెనో మన మూహింపవచ్చును. సామాన్యస్త్రీ హృదయ మచ్చొత్తినట్లు ఆ మాటలలో గోచరించుచున్నది. పండితులేమందురో కాని అనుభవరసికుల కందౌచిత్యమేయున్నది. రాచకూతురి కౌచితియు, సందర్భశుద్ధియు, వశిత్వమును నుండఁదగుననుట న్యాయ్యమే. కాని నా మనవి యేమన సుధేష్ణ యతిలోకయగు పతివ్రతగాని ప్రతిభారాశిగాని కాదు. సామాన్య రాజకుటుంబమునకుఁ జేరినది. స్త్రీసామాన్యములగు గుణములన్నియు నుండ కేటుఁబోవును? పైగా ననుభవజ్ఞత, కార్యచతురత, తిక్కన యా సంసారికి తీర్చిన మెఱుఁగులు. మనము ప్రతిదినముఁ జూఁచువారివంటిదే గాని సుధేష్ణ అరుదుగా ననుకొనఁదగినదియు, నిరంతరము పూజలందఁదగినదియు గాదు. ఇటఁదీర్చు తెలుఁగు లోకపు మఱుఁగు నెఱిఁగి చరియించు గేస్తురాలు. స్వభావము దుర్నివారముగదా! ఆమె యిటులన్నది.

మ|| ......ప్రభూతాశ్చర్యయై యిట్లనున్
వినునీరూపమునూఁచి మానృపతియు
వ్వీక్షూరు నేనెమ్మెయిన్
బనిగొందున్ దగనింతులున్ దగిలి నీ
పైఁ జూడ్కి నెక్కొల్పి నె
మ్మనము ల్విస్మయమంద జూచెదరు భా
మాపల్కు లింకేటికిన్

క|| దుర్భరయగు నినుఁగర్కటి
గర్భముధరియించునట్లు గైకొనినాకై
నిర్భరవిధ్వంసదశా
విర్భావముఁ దెచ్చుకొనుట వెరవైయున్నే!

పై వాక్యము లెంత యుక్తియుక్తములు గానున్నవి! వానిఁ జదువునపు డోకింత మఱుఁగుగా జెప్పియున్న సుధేష్ణశీలమునకు బాగుండెడిదేమో యను కొతుకుదప్ప మరి యే వైకల్యమునులేదు. కాని ఆసమయ మట్టిది. ఈస్పష్టతచే నీ యనుమాన మామె

కెంత తీవ్రమైనదో గ్రహింపవచ్చును. సైరంధ్రీరూపమును సాటివారగు స్త్రీలు గూడ "దగిలిచూడఁ" నిక మగవారి నడుగ వలెనా? ఇక విరాటుఁడేమి, విశ్వామిత్రుఁడా భీష్మించుటకు! ఒకవేళ పరవశుఁడగు రాజు చెడుత్రోవఁ ద్రొక్కిన తనబ్రదుకు "కర్కటి గర్భ"మగుటలో సందేహముండునా? ఇక సైరంధ్రిమాట యెవరెఱుఁగుదురు! ఇంతకు నింద్రియములు బలవత్తరములు. అట్టియెడ "నిర్భరవిధ్వంస దశావిర్భావము" గాక మఱేదియైనదట్టునేమో యోచింపుఁడు.

సైరంధ్రి యామెకొఱఁతఁ గనిపెట్టినది. ఆమె చాతుర్యము, ఆత్మశక్తి యిపుడు బయటఁబెట్టకున్న గతియేది! "నా చిత్తము తాదృశులకు గోచరమే" యని నిరసన హాసము గావించినది. "అస్మదీయకుల జన సంశిక్షాచారమహిమ యట్టిదియా" యని కౌలీనతను చూచాయఁగాఁ గానిపించి, యాభిజాత్యము పురస్కరించినది. "తద్విధాతిహీనవచనము" లని యసహ్యించుకొన్నది. "అట్టివి చెప్పకు" మని మందలించినది. పతుల సమాచారము వివరించి వెన్నుబలమును గంధర్వులని యుదాత్తతను బ్రకటించినది. పైగా ప్రపంచమును సామాన్య హృదయములను గురుతించిన యనుభవరాశి సైరంధ్రి. తను మన్నన తోడ నరయువారికి తన పతులు బాసటయై నిల్చి సాయముఁగావింతురని యాశఁ జూపినది. ఒకటివెంట నొకటి జ్యోతిశ్చక్రములఁబోలు పలుకులు ధారావాహికముగాఁ బ్రవహించినవి. ఇక సుధేష్ణప్రతిభ నిలుచునా? తలపంకించి, యోచించి, పరవాలేదనుకొన్నది. కుతూహల మొకటియున్నది గదా మనస్విత్వముతోఁ బాటు. అంతిపుర ముననుండఁ బనిచి సంతసిల్లినదట. కాని కన్నుమాత్రము సైరంధ్రిమీఁద నే.

ఇంకావుంది